క్లుప్తంగా

శాకంబరిగా కనకదుర్గమ్మ



జామి: ఆషాడమాసం శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భగవాన్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

చెల్లాపురం ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



అప్పన్న (ఫైల్)

మెరకముడిదాం: మండలంలోని చెల్లాపురం ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకుడిగా పదేళ్లుగా కొనసాగుతున్న ఆరిపాక అప్పన్న (45) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఆయన భౌతిక కాయం వద్ద భార్య, కుమార్తె భోరున విలపించారు. నిరుపేద కుటుంబానికి చెందిన అప్పన్న మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

గజపతినగరం: మద్యం సేవించి వానాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై యు.మహేష్ తెలిపారు. గజపతినగరం జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, లైసెన్స్, హెల్మెట్ లేకుండా బండి డ్రైవ్ చేసినా అపరాధ రుసుంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

మెరకముడిదాం: యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లి అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవద్దని బుధరాయవలస ఎస్సై బి.లోకేశ్వరరావు సూచించారు. సోమలింగాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగంతో అనారోగ్యం పాలవ్వడంతో పాటు జీవితం అంధకారంగా తయారవుతుందన్నారు. యువత మత్తుపదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

బొండపల్లి: కుష్టు వ్యాధి(లెప్రసీ)పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అంబటివలస హెల్త్ వెల్‌నెస్ కేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ ఎం.రాధ సూచించారు. అంబటివలస గ్రామంలో ఎంపీపీ స్కూల్ విద్యార్థులతో కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్పర్శలేని తెల్లని మచ్చలు ఉన్నట్లయితే వెంటనే కుష్టు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది చేస్తున్న సర్వేకి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భవిత కేంద్రం సిబ్బంది సూర్యనారాయణ, లక్ష్మణరావు, హెచ్ఎం ఇ.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

‘ముసురు’కుంది

- ఊపందుకున్న ఖరీఫ్ సాగు పనులు
- చెరువుల్లో జలకళ

నియోజకవర్గంలో శుక్రవారం నమోదైన వర్షపాతం

ఎస్.కోట	14.6 మి.మీ
వేపాడ	11.0 మి.మీ
ఎల్.కోట	15.6 మి.మీ
కొత్తవలస	13.6 మి.మీ
జామి	7.8 మి.మీ



జలకళ సంతరించుకున్న చెరువు



పొలంలో చేరిన వర్షపునీరు



ఉభాలకు వరినారు సిద్ధం చేస్తున్న మహిళా రైతులు

శృంగవరపుకోట: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ సాగుకు ఈ వర్షాలు ఎంతో అనుకూలంగా ఉంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటం, పొలాల్లో నీరు చేరడంతో వరినాడు మడులు వేసిన రైతులు పొలాలను దమ్ము చేసి, నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇన్నాళ్లూ నీటితడులు లేక ఎండిపోతున్న వరి వెద పొలాలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జీవం వచ్చింది.

నిండుతున్న చెరువులు

నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న ఐదు మండలాల్లో వ్యవసాయానికి చెరువులే ప్రధాన సాగునీటి ఆధారం. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగులు, గెడ్డల్లో నీరు చేరుతోంది. చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. పూర్తిగా నిండితే ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు.



లక్కవరపుకోట: మార్లాపల్లిలో వరద పరిస్థితులను అంచనా వేస్తున్న అధికారులు



కొత్తవలస జంక్షన్ వద్ద షాపుల్లోకి వెళ్లిన వరదనీరు

కంట్రోల్ రూంల ఏర్పాటు

లక్కవరపుకోట/కొత్తవలస: అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు లక్కవరపుకోట, కొత్తవలస మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్లు ప్రసాదరావు, చంద్రశేఖరరావు శుక్రవారం తెలిపారు. గ్రామాల్లో పరిస్థితుల పర్యవేక్షణకు రెవెన్యూ, మండల పరిషత్, వైద్య సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. రక్షిత మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం మార్లాపల్లి గ్రామంలో వరద పరిస్థితిలను తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఎంపీడీఓ రూపేష్, తదితరులు పరిశీలించారు.

ముంచెత్తిన వాన

కొత్తవలస/లక్కవరపుకోట: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువుల్లో వరదనీరు చేరడంతో జలకళ సంతరించుకున్నాయి. కొత్తవలస జంక్షన్ వద్ద వరదనీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి నీరు వెళ్లడంతో దుకాణదారులు అవస్థలు పడ్డారు. అలాగే కొత్తవలస-విజయగనరం రోడ్డులో గిడిజాల జంక్షన్ సమీపంలో రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా స్థానికులు దాని చుట్టూ ఇటుకలు పేర్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సహాయం కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

భారతీయ సంస్కార ప్రతిభా పరీక్షకు విశేష స్పందన



పోటీలకు హాజరైన విద్యార్థులు

లక్కవరపుకోట: గురుపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా మందిరం, సుపథ స్వచ్ఛంద సంస్థ సహకారంతో శుక్రవారం నిర్వహించిన భారతీయ సంస్కార ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించింది. లక్కవరపుకోట, వేపాడ, ఎస్.కోట మండలాల నుంచి 164 మంది 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు పరీక్షలు రాసినట్లు సుపథ సంస్థ ప్రతినిధి ఎ.శ్రీహరిశర్మ తెలిపారు. వేదపఠన విభాగంలో 11 మంది, హనుమాన్ చాలీసా, ఆదిత్య హృదయం పోటీల్లో 58 మంది పాల్గొన్నట్లు చెప్పారు. శ్రీమద్రామాయణంలో బాలకాండ, అయోధ్య, అరణ్య కాండలోని శ్లోకాలపై, రామాయణం, శ్రీకృష్ణ చరితామృతం, తదితర వాటిల్లో నుంచి ప్రశ్నలు అడగడం జరిగిందన్నారు. విజేతలకు ఈ నెల 21న బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



చెత్తపోగులు తొలగిస్తున్న దృశ్యం

జామి: మండలంలో గొడికొమ్ము, శింగవరం గ్రామాల్లో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని చెత్తపోగులను జేసీబీ సాయంతో తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. రక్షిత పథకాలను క్లోరినేషన్ చేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సర్పంచ్ భవాణీ పనులను పర్యవేక్షించారు. వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి గోపాలకృష్ణ

కొత్తవలస: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో శుక్రవారం సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జ్వరాలు, ఇతర అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య సేవలందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల సమన్వయంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయాలని అన్నారు. ఇళ్ల ముందు మురుగునీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పద్మావతి, నరసింహారావు, ఈశ్వరరావు, సత్యారావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లపైనే నువ్వుపంట నూర్పిడి

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



వేపాడ-దేవరాపల్లి రోడ్డుపై వదిలేసిన నువ్వుపంట వ్యర్థాలు



సోంపురం-ఆనందపురం రోడ్డులో వేసిన నువ్వుచేను కుప్పలు

శృంగవరపుకోట: వేపాడ మండలం సోంపురం-ఆనందపురం రహదారిపై, వేపాడ-దేవరాపల్లి రోడ్డుపై పలువురు రైతులు నువ్వుచేలు ఎండబెట్టి నూర్పిడి చేస్తుండటంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. రోడ్డుపై పడిన నువ్వుపంట వ్యర్థాలు వర్షాలకు తడిచిముద్దవడంతో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడిపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. రహదారి మలుపుల వద్ద నువ్వుచేని కుప్పలుగా పెట్టడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను ఎవరికి చెప్పాలో, ఎవరిని నిందించాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు దీనిపై స్పందించి రోడ్డుపై పంట వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు మండల సమావేశం

మెరకముడిదాం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పావని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని వెల్లడించారు. మండలానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఇన్‌చార్జ్ ఎస్సైగా మహేష్

దత్తిరాజేరు: పెదమానాపురం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్సైగా గజపతినగరం ఎస్సై మహేష్ వ్యవహరించనున్నారు. పెదమానాపురం ఎస్సై శిరీష వ్యక్తిగత పనిపై రెండు వారాల పాటు సెలవు పెట్టడంతో గజపతినగరం ఎస్సై మహేష్‌కు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు.

నేడు చదరంగ దినోత్సవం

చీపురుపల్లి: అంతర్జాతీయ చదరంగం దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీనివాసా జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏడీఎస్ఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే అంతర్జాతీయ స్థాయిలో ఉన్న వివిధ చదరంగం బోర్డులు ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

65 మందికి వైద్య సేవలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ శిబిరంలో పాల్గొని సుమారు 65 మందికి వైద్య సేవలందించారు. జ్వరం, జలుబు, వంటి లక్షణాలతో పాటు బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ఇంటి ముందు చెత్తా చెదారాలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ

గజపతినగరం: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చూడాలని ఎంఈఓ-2 సాయిచక్రధర్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు లెస్సన్ ప్లాన్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూ కచ్చితంగా అమలు చేయాలని, భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పీఏసీఎస్‌కు దారేది?



భవనం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

వేపాడ: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్/కోఆపరేటివ్ బ్యాంకు)కు దారేదంటూ ఖాతాదారులు ప్రశ్నిస్తున్నారు. వేపాడ-ఆనందపురం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గోడలపై పిచ్చిమొక్కలు మొలకెత్తాయి. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో దారి మూసుకుపోయింది. ఇక్కడ పనిచేసే సిబ్బందితో పాటు వివిధ పనులపై వచ్చే ఖాతాదారులు లోపలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భవనం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, తుప్పలు తొలగించాలని, భవనానికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

టీకాయే శ్రీరామ రక్ష

- క్షయ వ్యాధి నుంచి రక్షణకు బీసీజీ టీకా
- గ్రామాల్లో చురుగ్గా వ్యాక్సినేషన్



కొత్తవలసలో వృద్ధురాలికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గజపతినగరం రూరల్: క్షయ (టీబీ) వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే చికిత్స మొదలు పెట్టాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. ఒక్కసారి వ్యాధి బారిన పడినట్లయితే ఊపిరితిత్తులు పాడవ్వడంతో పాటు శరీరంలోని ఇతర అవయవాలకు వ్యాపించే ప్రమాదం ఉంది. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు, రక్తపోటు(బీపీ), షుగర్ వ్యాధితో బాధపడేవారికి బీసీజీ టీకాలను ఉచితంగా వేస్తున్నారు. క్షయ వ్యాధి నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే బీసీజీ టీకాను తప్పకుండా వేసుకోవాలి. మండలంలోని మరుపల్లి పీహెచ్‌సీ పరిధిలో 60 ఏళ్లు దాటిన వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సుమారు 3,245 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు వైద్యాధికారి సాయికృష్ణ తెలిపారు.

టీకా తప్పనిసరి

గ్రామాల్లో 60 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరు బీసీజీ టీకా వేయించుకోవడం వల్ల క్షయ వ్యాధికి గురికాకుండా ఉంటారు. షుగర్ వ్యాధి గ్రస్తులు కూడా ఈ టీకా వేసుకోవచ్చు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ సాయికృష్ణ, మరుపల్లి పీహెచ్‌సీ

విద్యార్థులకు కిట్లు పంపిణీ



గుర్ల: విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు



వేపాడ: విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, సర్పంచ్ దేవీ, తదతరులు

గుర్ల: మండలంలోని నడుపూరు హైస్కూల్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌ను జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించిన కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల గౌరవాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రోతు తాతమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

వేపాడ: మండలంలో నీలకంఠరాజపురం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన స్టూడెంట్స్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, సర్పంచ్ గొటివాడ దేవీ, ఉపసర్పంచ్ కండిపల్లి పెదనాయుడు చేతులమీదుగా వీటిని విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని కోరారు.

కౌలురైతుల సమస్యలు పరిష్కరించండి



వినతి పత్రం అందజేస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

బొండపల్లి: కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోత్తడి పైడిపునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గొల్లుపాలెం సచివాలయంలో ఇంజినీరింగ్ సహాయకుడుకి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హత గల కౌలు రైతులను గుర్తించి వారందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవాదాయ భూములు సాగుచేస్తున్న రైతులతో జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఈనెల 20న సమావేశం ఏర్పాటు చేశామని, రైతులంతా తరలిరావాలని కోరారు. ఉపాధి వేతనదారులకు బకాయి ఉన్న వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టి.దేవుడు, ఈదుబిల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.